క్లుప్తంగా

రామాలయంలో వైద్య శిబిరం



మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న వైద్య బృందంతో ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో శ్రీరామ బాలభక్త సమాజం(రామాలయం) ఆధ్వర్యంలో ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మంది స్థానికులు, భక్తులకు ఉచితంగా డయాబెటిస్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేసి తగు సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఓమ్ని ఆర్కే హాస్పిటల్ డాక్టర్ సుకుమార్ ఇతర సభ్యులు, రామాలయ ప్రెసిడెంట్ నూనెల పోలారావు, సెక్రటరీ బోరవర శంకర్‌రెడ్డి, కోశాధికారి నంబారి వెంకటేశ్వరరావు, బి.వి.రెడ్డి, బి.పి.రెడ్డి ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత



కుటుంబ సభ్యులకు జూంకలమ్మను అప్పగిస్తున్న ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డి

సీతమ్మధార: తప్పిపోయిన ఓ వృద్ధురాలిని ఆమె కుటుంబ సభ్యులకు ద్వారకా పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్డులో నివసిస్తున్న కె.జూంకాలమ్మ(65) శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. స్థానిక ఆటో డ్రైవర్లు వృద్ధురాలిని గమనించి ద్వారకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు జూంకాలమ్మ కుమార్తెలను స్టేషన్ పిలిపించగా.. వారికి వృద్ధురాలిని ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డి అప్పగించారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: భాద్రపద మాస శుద్ధ విదియ సందర్భంగా శనివారం తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీ దళబిల్వార్చనలు నిర్వహించారు. భక్తులకు స్వామి ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్

సీతమ్మధార: ద్విచక్ర వాహనం ఉన్న ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్ సూచించారు. ద్వారకానగర్ రెండో లేన్‌లోని పొలాక్స్ స్కూల్‌లో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులంతా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సిగ్నల్ వద్ద రెడ్ లైట్ వెలిగేటప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ వెలి గేటప్పుడు ముందుకు వెళ్లాలని వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

- ద్వారకా సీఐ సింహాద్రినాయుడు
- వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులకు సూచనలు



సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా జీవీఎంసీ, ఫైర్, ఎలక్ట్రికల్, పోలీసుల అనుమతులు తీసుకోవాలని సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు స్పష్టం చేశారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. మండపం వద్ద రాత్రి పూట ఇద్దరు నిర్వాహకులు ఉండాలనాలని, ప్రతి మండపం వద్ద నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా లేకుండా చూసుకోవాలన్నారు. పేలుడు పదార్థాలు కాల్చితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు, ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో గణపతి మండపాలు ఉండకూడదని, పెద్ద సౌండ్‌లు, డీజే బాక్స్‌లు పెడితే చర్యలు తప్పవన్నారు.

ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మండపాలు తెరిచి ఉంచాలని, 15 రోజుల పాటు సీసీ కెమెరా ఫుటేజీలు భద్రపరచాలని సూచించారు. మండపాలు, పందిళ్ల వద్ద మద్యం తాగి అల్లర్లు, గొడవలు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రైవేట్ స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేసినప్పుడు స్థల యాజమాని వద్ద నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద పోలీస్ ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. శాంతిభద్రతలు విఘాతం కలిగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ సింహాద్రినాయుడు హెచ్చరించారు.

గురుద్వారా జంక్షన్ అభివృద్ధికి ప్రణాళికలు



బస్‌స్టాప్ వద్ద టాయిలెట్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ

సీతమ్మధార: గురుద్వారా జంక్షన్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. గురుద్వారా జంక్షన్‌లో బస్‌స్టాప్ వద్ద నిర్మించిన టాయిలెట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుద్వారా కూడలిలో వద్ద ఉన్న పార్కులో ఫౌంటైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని సూచించారు. పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



వాకర్స్ జిల్లా-101 ఎలెక్ట్ గవర్నర్ ద్వారకానాథ్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు సభ్యులు తీర్మానించారు. ముఖ్యంగా ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ, ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు, మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు కె.ద్వారకానాథ్ 2024 సంవత్సరానికి వాకర్స్ జిల్లా-101కు ఎలెక్ట్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ద్వారకానాథ్ మాట్లాడుతూ మురళీనగర్ క్లబ్ ప్రతినిధిగా గవర్నర్ పదవికి ఎన్నికవడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. వాకర్స్ క్లబ్‌ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వాకర్స్ పార్కులో జిల్లాకు చెందిన మహనీయుల చిత్రపటాల ఏర్పాటుకు తనవంతుగా రూ.20 వేల విరాళాన్ని ఆయన ప్రకటించారు. పూర్వ జిల్లా గవర్నర్ చలసాని భాస్కరరావును సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ రాళ్లపల్లి సత్యనాథం, సీహెచ్ కృష్ణమూర్తి, సత్తి సునీల్‌రెడ్డి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, వద్దాది అప్పారావు, పి.చెల్వరాజు, ఎంఎస్ఆర్ మూర్తి, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోటాపోటీగా స్కూల్ గేమ్స్



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో రెండో రోజు శనివారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలురకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 స్కూళ్ల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గౌరీశంకర్ కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మధురానగర్ స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి, ఎన్జీజీవోస్ కాలనీ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, పీడీలు సునంద్, తబిత, పీఈటీలు త్రినాథ్, సురేష్, శారద, ఉపాధ్యాయ సిబ్బంది పోటీలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు అభినందనలు



గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణతో విస్టాటెక్‌లో పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

మురళీనగర్: విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి విస్టా టెక్‌ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆయిల్ టెక్నాలజీ విభాగం 7వ సెమిస్టర్ విద్యార్థులు ఎస్.లిఖిత, ఆర్.ఆర్తి, వి.షాలిని, వై.వందన పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు సీతాఫలం గింజల నూనెను చర్మం, కురుల సౌందర్యానికి వినియోగించే విధానాన్ని ఇందులో వివరించారు. టి.సందీప్, టి.ఉదయ్, కె.సంతోష్, పి.దుర్గానవీన్‌లు హైడ్రోఫోనిక్ టెక్నాలజీ ద్వారా టెర్రస్ ఫార్మింగ్‌పై పోస్టర్ ప్రదర్శించి బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.కృష్ణారెడ్డి, డి.దామోదర్ పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్లు



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: కొత్తగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించాలని, సాంకేతిక సమస్యలను నివారించాలని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అందుకు మేయర్ స్పందిస్తూ త్వరలోనే అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంథి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి.దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, బి. సత్యనారాయణ, ఆర్ఎస్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లు గోవిందరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, సత్యనారాయణ, రాజాన రాంబాబు, గణేష్, ఎస్. శ్రీనివాస్, అప్పన్న, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



తోపుడుబళ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. కంచరపాలెం మెట్టు, రైతుబజారు, ఊర్వశి జంక్షన్, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో శనివారం సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని, తోపుడుబళ్లను తొలగించామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా రోడ్లపై రద్దీని దృష్టిలో ఉంచుకుని రహదారులను ఇరువైపులా ఆక్రమించి చేసే ఎటువంటి వ్యాపారాలను అనుమతించమన్నారు. ఎస్ఐ పాపారావు, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లీ కొడుకుల అదృశ్యం

సీతమ్మధార: ఇంటి నుంచి వెళ్లిన తల్లి, కొడుకు అదృశ్యమైన ఘటనపై ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రైల్వే న్యూకాలనీకి చెందిన చీకటి కేశవ్, జగదీశ్వరీలకు ఐదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఐదేళ్ల బాబు సందీప్ ఉన్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో కొడుకు సందీప్‌ను తీసుకొని వెళ్లిన జగదీశ్వరి తిరిగి ఇంటి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 14న ఫోర్త్‌టౌన్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు



నక్కవానిపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సత్యం జంక్షన్ నుంచి నక్కవానిపాలెం, అల్లూరి సీతారామరాజు కూడలితోపాటు హెచ్‌బీ కాలనీ వరకు పలు ఆక్రమణలను శనివారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీపీ నేతృత్వంలో ఏసీపీ ఆధ్వర్యంలో టీపీవో అనిత పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. రోడ్డుపైకి ఉన్న భవన నిర్మాణాలను, రోడ్డు పక్కనే ఉన్న బడ్డీలు, తోపుడు బళ్లను, ప్రకటనల బోర్డులను తొలగించారు. చైన్ మేన్, సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్ తదితరులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలోని దేవదాయ శాఖ దుర్గాగణపతి ఆలయంలో ఈ నెల 18 నుంచి 27 వరకు నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. శనివారం ఆలయంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి విశేష పూజలు, గణపతి హోమం, మహా అభిషేకం, సహస్రనామార్చన జరుగుతాయన్నారు. ప్రతి రోజూ సాయంత్రం దుర్గాగణపతి రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 18న దుర్గాగణపతి నిజరూప దర్శనం, 19న స్కంద గణపతిగా, 20న వాణి గణపతిగా, 21న లక్ష్మీగణపతిగా, 22న ఆది గణపతిగా, 23న విష్ణుగణపతిగా, 24న వీర గణపతిగా, 25న బాల గణపతిగా, 26న అర్ధనారీశ్వర గణపతిగా, 27న సిద్ధి బుద్ధి సమేత గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. ముందుగా దుర్గాగణపతికి పూజలు చేశారు. కార్పొరేటర్ గోవింద్ మాట్లాడుతూ దుర్గాగణపతి అనుగ్రహం, దాతల సహకారంతో గతేడాది ఆలయాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ ఏడాది కూడా కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఆలయం వద్ద భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, 27వ తేదీ సాయంత్రం స్వామి వారి భారీ ఊరేగింపు జరుగుతాయన్నారు. ఆలయ ఈవో రమాభాయి మాట్లాడుతూ చవితి రోజున భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.300 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో తొమ్మిది రోజులు సహస్ర నామార్చన చేయించుకోవచ్చని తెలిపారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఆలయ అర్చకులు నటరాజన్, మొకర వెంకటరావు, వై.దేవేంద్రరావు, వానపల్లి లక్ష్మణరావు, బోర వెంకటరమణ, సారిపిల్లి గంగరాజు, ముద్దాడ ఎల్లాజీ, గౌరినాయుడు, అప్పన్న, ఉప్పాడ సన్నీ, హరి, శ్రావణ్, మన్మథరావు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె.రాజు, అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో ప్రజలంతా క్షేమంగా ఉన్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 14వ వార్డు 1086111 సచివాలయం పరిధిలోని ఏఎస్సార్ నగర్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజుతో కలిసి ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి గడపకూ పథకాలు అందజేస్తూ ప్రజలకు అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి అమర్‌రెడ్డి, డైరెక్టర్ నూకరాజు, సెక్యూరిటీ శ్రీనివాస్, కిరణ్‌రాజు, బల్ల శ్రీను, కె.సత్యనారాయణ, కె.సుశీల, ఆదిరెడ్డి అప్పారావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కప్పరాడ హైస్కూల్‌లో ఓజోన్ డే



చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో హెచ్‌ఎం విజయమాలిని, ఉపాధ్యాయులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని కప్పరాడ ఉన్నత పాఠశాలలో సోషల్, సైన్స్ టీచర్ల నేతృత్వంలో శనివారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని స్కూల్ హెచ్‌ఎం వి.విజయమాలిని ప్రారంభించారు. విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఓజోన్ పొరను కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఉపాధ్యాయులు అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన చార్ట్ వర్క్‌లు ఆకట్టుకున్నాయి. పి.సీతారామ్, ఎస్.రాథో, గణేష్, శ్రీను, జి.పి.నాయుడు, రమణమ్మ, ఉప్పల కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న బాణాల తరుణ్‌కుమార్



శాంతినగర్‌లో గణపతి విగ్రహాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



ఇందిరానగర్‌లో గణేష్ ప్రతిమలు అందజేస్తున్న కర్రి రామారెడ్డి



సీతమ్మధారలో మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న మేడపాటి కృష్ణారెడ్డి



మాధవధార హైస్కూల్‌లో విద్యార్థులకు మట్టి విగ్రహాలను అందిస్తున్న కీర్తి పట్నాయక్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు నందగిరినగర్‌లోని ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బాణాల తరుణ్‌కుమార్ చేతుల మీదుగా శనివారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని కోరారు. హానికర రంగులు వినియోగించి చేసిన ప్రతిమలు వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇజ్జు సీతారాములు, మహదాస్యం గోపి, పి.గోపి, పెద్ద అప్పారావు, పి.వెంకట్, రమణరాజు, రమేష్ పాల్గొన్నారు.

500 మందికి ప్రతిమల పంపిణీ

కంచరపాలెం: పర్యావరణానికి మేలు చేసే మట్టి గణనాథులను పూజిద్దామని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పిలుపునిచ్చారు. 46వ వార్డు శాంతినగర్ సచివాలయ ఆవరణలో శనివారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన సుమారు 500 మందికి ప్రతిమలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

- 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్-5 కమ్యూనిటీ హాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి నేతృత్వంలో పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి ముఖ్య అతిథిగా మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని రామారెడ్డి కోరారు. సుమారు 300 మంది మహిళలకు ప్రతిమలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కండిపల్లి శ్రీను, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

సీతమ్మధార: పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని స్వాతి ప్రమోటర్స్ సంస్థ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి అన్నారు. సీతమ్మధారలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు మట్టి గణపతులను ఆయన పంపిణీ చేశారు.

పర్యావరణ హితంగా వినాయక చవితి

మురళీనగర్: వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ రాళ్లపల్లి సత్యనాథం పిలుపునిచ్చారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానికులకు వంద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వాకర్ రాళ్లపల్లి సత్యనాథం, పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, జి.కాశీవిశ్వనాథం, మాచిరాజు నారాయణరావుల సహకారంతో వీటిని అందించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో హవే వెంచర్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులకు వినాయక విగ్రహాలతోపాటు వినాయక వ్రత కల్ప విధానం పుస్తకాలు అందించారు. హైవే వెంచర్స్ అధినేత సీహెచ్ హేమారావు పాల్గొన్నారు.
- మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ జి.నాగిరెడ్డి సహకారంతో ట్రస్ట్ చైర్మన్ కీర్తి పట్నాయక్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. వైజాగ్ ఎన్‌జీవో ఫోరం సభ్యుడు లోకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కె.కాలనీ హైస్కూల్‌లో క్రాఫ్ట్ టీచర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టితో విగ్రహాలను తయారు చేసి ఇతర విద్యార్థులకు అందించారు.
- మురళీనగర్‌లో మానవ సేవే మాధవ సేవ సంఘం అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పాల్గొని 1000 మందికి మట్టి విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వాకర్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ యు.శుభ, మురళీనగర్ రెసిడెన్సియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

51వ వార్డులో..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కార్యాలయం వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు శనివారం మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పార్టీ నాయకులు కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, వినోద్, రాజేశ్వరరావు, మోహన్‌రావు, ఉదయ్, ఆర్.పి.నాగమణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేసిన పూర్వ విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న వైద్యులు

సీతమ్మధార: పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ కరెస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ కేవీ జోసెఫ్ అన్నారు. సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం పూర్వ విద్యార్థులు సంఘ ఆధ్వర్యంలో ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో స్కూల్ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. పాఠశాల స్వర్ణోత్సవాల సందర్భంగా తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి, గౌరవిస్తామన్నారు. రక్తదానం చేసిన పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ పి.మనోజ్ అభినందించారు. వైద్యులు బ్లడ్ డోనర్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పీవీఎస్‌వీ ప్రసాద్, డా.మురళీధర్, టి.అనిల్‌కుమార్, ఎస్.వినోద్, డా.ఎస్.సురేష్, రాయల్ శ్రీనివాస్, టి.ప్రతాప్, త్రిపుర, రూబీ, రాఘవ్, రవికిరణ్, ఉపాధ్యాయులు గోవింద్‌రాజులు, ఆరసి జాన్, వీర, హిల్డ జోసెఫ్ పాల్గొన్నారు.